ప్రజాశక్తి
మంగళవారం 29 ఆగస్టు 2023 5
అనంతపురం

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మాధవ్ ముద్రేది..!?

◆ ఊహించకుండా ఎంపి అయ్యారు... ఇప్పుడు కనుమరుగయ్యారు ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోలీసు అధికారిగానున్న ఆ ఎంపీ ఉన్నఫలంగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. పోటీ చేసిన మొదటి సారే ఎంపీగా కూడా గెలిచారు. పోలీసు అధికారిగానున్న సమయంలోనూ ఆయన చుట్టూ అనేక వివాదాలున్నప్పటికీ ఏదో రకంగా నెట్టుకొస్తూ వచ్చారు. అయితే ఎంపీ అయిన తరువాత చుట్టుముట్టిన వివాదం ఆయన మొత్తం జీవితాన్నే దెబ్బకొట్టేసిందా అన్నట్టుగా మారింది. మహిళతో నగ్నంగా వీడియో మాట్లాడారంటూ సోషియల్ మీడియాలో సాగిన ప్రచారంతో ఆయన ప్రతిష్టను దెబ్బతీసింది. ఆ వీడియోపై పెద్ద దుమారమే రేగి, తరువాత చల్లారినప్పటికీ ఆయనకు మాత్రం మాయని మచ్చగానే మిగిలింది. అప్పటి నుంచి ఆయన రాజకీయంగానూ అంత క్రియాశీలకంగా కనిపించడం లేదన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తదితరులు ముఖ్యమైన నాయకులు వచ్చినప్పుడు తప్పా తక్కినప్పుడు ఎక్కడా ఆయన కనిపించడం లేదు. పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల సమీక్షల్లోనూ ఆయన ఆచూకీ లేదనే చెప్పాలి.

అభివృద్ధిలో కనిపించని ముద్ర

హిందూపురం పార్లమెంటు సభ్యులుగా నున్న గోరంట్ల మాధవ్ తన నియోజకవర్గం పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర కనిపించలేదన్న విమర్శలున్నాయి. కేంద్రం ద్వారా వచ్చే నిధులతో చేపట్టే కార్యక్రమాలు అనేకముంటాయి. వాటిని సాధించేందుకు ఆయన పెట్టిన కృషి ఏమిటన్నది తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవైపు ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి ప్రాంతాల్లో చేనేత పరిశ్రమ విరివిగా ఉంది. ఈ పరిశ్రమకు కేంద్రం ఊతమిస్తోంది. అక్కడి నుంచి ప్రత్యేకమైన నిధులు రాబట్టలేకపోయారన్న విమర్శలున్నాయి. అదే విధంగా ఈ ప్రాంతంలోనే పట్టు పరిశ్రమ ఉంది. ఈ పట్టు రైతులకు, రీలర్లకు రావాల్సిన రాయితీలు రాలేదు. దీనిపైనా ఆయన స్పందించిన దాఖలాలు ఎక్కడా లేవు. ఇక రైల్వేకు సంబంధించి కొత్త ప్రాజెక్టు ఏఒక్కటీ ఈ నాలుగేళ్లలో సాధించలేకపోయారు. ఇక కేంద్ర సంస్థలైన నాసన్, బెల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాటి కోసం ఆయన కృషి చేసింది శూన్యమేనని ఆ ప్రాంతవాసులు విమర్శిస్తున్నారు.

ఈసారీ అవకాశం లేనట్టేనా ?

మరికొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థుల అన్వేషణ మొదలుపెట్టాయి. వైసిపి కూడా ఎవరైతే సరిపోతారన్న దానిపై దృష్టి సారించిందనే చర్చ సైతం నడుస్తోంది. అయితే మాధవ్‌కు ఈసారి అవకాశం దాదాపుగా లేదనే ప్రచారమే సాగుతోంది. దీంతో కొత్తగా టిక్కెట్టు ఆశించే వారు సైతం తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ముఖ్యమైన నాయకులను, ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులను కలువడం, తమకు అవకాశం కల్పించాలన్న విజ్ఞాపనలను సైతం అందజేస్తున్నారు. అయితే మొదట అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించిన నేతలు పార్లమెంటు సభ్యులపై ఇంకా అంత సీరియస్‌గా దృష్టి సారించలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

◆ వామపక్షాల పిలుపు ◆ 'విద్యుత్' అమరులకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న విద్యుత్ భారాలను రద్దు చేయించేందుకు నాటి బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంత టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు హాజరై విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణల్లో భాగంగా 2000 సంవత్సరంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలు మృతి చెందారని తెలిపారు. 23 సంవత్సరాల క్రితం టిడిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా వామపక్షాలు నిర్వహించిన పోరాటం రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చిందన్నారు. అప్పటి వరకు ప్రపంచ బ్యాంకు ఆదేశాలే విధానాలుగా అమలవుతూ ప్రజా సంక్షేమాన్ని వదిలేసిన కాంగ్రెస్, టిడిపి పార్టీలు తిరిగి ప్రజా మార్గం పట్టించడంలో విద్యుత్ ఉద్యమం ముఖ్య భూమిక పోషించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడుల తరువాత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజలను చేరుకోవడానికి పాదయాత్రలు నిర్వహించేలా చేసింది ఆ ఉద్యమమే అని గుర్తు చేశారు. నాడు జరిగిన ఉద్యమ ప్రభావంతో ఆ తరువాత 12 సంవత్సరాలకు పైగా విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు సాహసం చేయలేకపోయాయని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి కారణం నాటి ఉద్యమమే అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం వివిధ పేర్లతో విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాలు వేస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాల్లో భాగంగా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించేందుకు నూతన విద్యుత్ చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టాన్ని దేశంలో అందరికంటే ముందుగా అమలు చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్‌లు పెట్టడం, స్మార్ట్ మీటర్ల పేరుతో అదాని కంపెనీకి రూ. వేల కోట్లు దోచి పెడుతోందన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు, సర్‌చార్జీల పేరుతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు మరో చారిత్రాత్మకమైన ఉద్యమాన్ని నిర్వహించనున్నాయని, ఈ ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, వి.సావిత్రి, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్, రామాంజినేయులు, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, అల్లీపీరా, రమణయ్య, సిపిఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్వరి, న్యూడెమోక్రసీ నాయకులు సి.నాగరాజు, ఆటో శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ధరలను అదుపు చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి తెలిపారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఇందుకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంటు ఛార్జీలు, ధరలు పెరిగిపోయాయన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగం కల్పిస్తామని నిరుద్యోగ యువతను మోదీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వలీ, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ సీన, రాజు, వరలక్ష్మి, గపూర్, ఆటో యూనియన్ నాయకులు ఆదినారాయణ, శివ, గపూర్, రామ లింగా రెడ్డి, కెవిపిఎస్ నగర నాయకులు రాజు, అవాజ్ నగర నాయకులు ఇస్మాయిల్, భవన నిర్మాణ కార్మిక సంఘం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాయదుర్గం : పట్టణంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ స్థలంతోపాటు ఇల్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో నేటికీ సొంతిల్లులేని నిరుపేదలు అనేకమంది ఉన్నారన్నారు. సొంత గూడు లేక చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకోలేక, పిల్లలకు సరైన విద్య, వైద్యం అందించుకోలేని దుస్థితిలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజానీకం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అధికార పార్టీ నాయకులు ప్రతిపాదించిన అనుచరులు, వారికి సంబంధించిన వారికే ఇల్లు, ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే నగరంలో స్థలం, ఇల్లు లేని పేదలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి మధు, నాయకులు తిమ్మరాజు, రమేష్, పి.నాగరాజు, హారూన్, అంజి, మల్లికార్జున, మహేష్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాధ్యతలు చేపట్టిన డిఎంఅండ్‌హెచ్ఒ దేవి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఇబి.దేవి విధుల్లో చేరారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఒగా పనిచేస్తున్న డాక్టర్ ఇబి.దేవి ఉద్యోగోన్నతిపై అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ యుగంధర్, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, చెన్నకేశవులు, నారాయణస్వామి, అనుపమ జేమ్స్, మహేంద్ర నాథ్, ఎస్ఒ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గరంగరంగా తాడిపత్రి కౌన్సిల్‌మీట్

◆ 6వ వార్డు కౌన్సిలర్ సస్పెండ్‌కు తీర్మానం

◆ అభ్యంతరం తెలిపిన కౌన్సిలర్ హర్షవర్ధన్‌రెడ్డి

◆ చర్చ లేకుండా కౌన్సిల్ తీర్మానాలు ఆమోదం

ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డిని ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ హర్షవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గరంగరంగా సాగింది. టిడిపి, వైసిపి కౌన్సిలర్ల వాదనాలు, ప్రతి వాదనల మధ్య కౌన్సిల్ హాల్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం 38 అంశాలతో కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభం కాగానే ఇటీవలే పార్టీ మారిన ఆరో వార్డు కౌన్సిలర్ రాబర్ట్‌ను లక్ష్యంగా చేస్తూ టిడిపి కౌన్సిలర్లు మాట్లాడారు. బాధ్యత కలిగిన కౌన్సిలర్ మున్సిపల్ ఆస్తిని అక్రమంగా ఆక్రమించుకున్నారని, మున్సిపల్ చట్టం ప్రకారం రాబర్ట్‌ను మూడు కౌన్సిల్ సమావేశాల కాలం పాటు సస్పెండ్ చేయాలంటూ టిడిపి సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. వెంటనే దీనిపై వైసీపీ కౌన్సిలర్ హర్షవర్ధన్ రెడ్డి కల్పించుకున్నారు. కౌన్సిలర్ రాబర్ట్ నిర్మించుకుంటున్నది ప్రయివేటు స్థలం అన్నారు. అందుకు సంబంధించిన అన్ని రికార్డులూ ఉన్నాయని, ఇలాంటి సమయంలో అకారణంగా ఆయన్ను ఎలా సస్పెండ్ చేస్తారని నిలదీశారు. ఈసమయంలో ఇరు పార్టీలకు సంబంధించిన కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో వాదనలు చేసుకున్నారు. ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియంపైకి హర్షవర్ధన్ రెడ్డి ఎక్కడంతో కౌన్సిల్ సమావేశ మందరం ఒక్కసారిగా గందరగోళంగా మారింది. ఈ గందరగోళం నడుమనే కౌన్సిల్ అజెండాలోని 38 అంశాలపై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదిస్తున్నట్లు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు.

సమస్యలు పక్కదారి

రాష్ట్రంలోని మున్సిపాల్టీలు అన్నింటినీ వైసీపీ కైవసం చేసుకున్నా తాడిపత్రి మున్సిపాలిటీ మాత్రం జెసి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపికి దక్కింది. ఇంతవరకు బాగాఉన్న వైసిపి, టిడిపి మధ్య నిరంతరం ఘర్షణలతో పట్టణ అభివృద్ధి కుంటుబడుతోందనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది. పట్టణంలోని అండర్ డ్రెయినేజీ, పచ్చదనం పరిశుభ్రత, తాగునీరు, టౌన్ ప్లానింగ్ తదితర సమస్యలు పట్టణ ప్రజలను పీడిస్తున్నాయి. మున్సిపల్ సమావేశాల్లో వీటి గురించి చర్చ జరపకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

జిల్లాలోని హాస్టళ్లతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, అధ్యక్షుడు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం రాయదుర్గం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక సంక్షేమ హాస్టళ్లలో తాగడానికి మంచినీరు, నాణ్యమైన భోజనం, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఐదు నెలల నుంచి హాస్టళ్లకు కాస్మొటిక్ ఛార్జీలను పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనారు. అదేవిధంగా హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. ముఖ్యంగా రాయదుర్గం, డి.హీరేహాల్‌లోని జూనియర్ కళాశాలలకు సొంత భవనం కేటాయించాలని, ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటిదాకా పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోగా రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేమని మంత్రి ప్రకటన చేయడం దౌర్భాగ్యమన్నారు. ఈ మధ్యకాలంలో విద్యార్థినులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, ఈవ్‌టీజింగ్‌ను నివారించి నిర్భయ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలకు సంబంధించి నూతన జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాష్ట్ర గర్ల్స్ కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సునీత, జిల్లా నాయకులు తరిమెల గిరి, శివ, విజయ్, భీమేశ్, అనిల్, ఏరేష్, గౌతమ్, లోకేష్, నందన్, మాదేష్, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవరెక్కిన ఆర్ఎంపి వైద్యుడు

ప్రజాశక్తి-పుట్లూరు



సెల్‌టవర్‌పై ఉన్న ఆర్ఎంపి వైద్యుడు వెంకటేష్

సైబర్ నేరాగాళ్ల ఉచ్చులో పడి మోసపోయిన డబ్బులను రికవరీ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ, న్యాయం చేయాలని ఓ ఆర్ఎంపి వైద్యుడు సెల్‌టవరెక్కి నిరసన తెలిపాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఎ.కొండాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ఆర్ఎంపి వైద్యునిగా పని చేస్తున్నాడు. గతేడాది ఇతని సెల్‌కు ఓ సందేశం వచ్చింది. మీకు లక్కీడిప్‌లో కారు తగిలింది అనేది ఆ సందేశం సారాంశం. దీంతో ఆయన మేసేజ్ వచ్చిన నెంబర్‌తో మాట్లాడారు. కారు బహుమతిగా వచ్చిన మాట వాస్తవమే అని, దానిని పొందాలంటే కొంత ఛార్జీల రూపంలో చెల్లించాల్సి ఉందని వారు తెలిపారు. దీంతో ఆయన పలు దఫాలుగా రూ.15 లక్షల వరకు వారు చెప్పిన ఖాతాలకు జమ చేశారు. కొద్ది రోజుల తరువాత వారి నెంబర్లు అన్నీ పని చేయకుండా పోయాయి. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆయన పుట్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 2022 సెప్టెంబర్ 20వ తేదీన ఈయన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తాను మోసపోయిన డబ్బులను ఇప్పించడంలో పోలీసుల విచారణ సరిగా లేదన్న మనస్తాపంతో ఆర్ఎంపి వైద్యుడు వెంకటేష్ సోమవారం ఉదయం అదే గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కాడు. తనకు న్యాయం చేయకపోతే అక్కడి నుంచి దూకి చనిపోతానంటూ తెలిపాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతనితో సెల్‌ద్వారా మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి కిందకు దింపారు. అనంతరం ఎస్ఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఎంపి వైద్యుడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేశామన్నారు. దీనిపైనా దర్యాప్తు చేపట్టి, బ్యాంకుఖాతాల్లో ఉన్న రూ.2 లక్షలను ఫ్రీజ్ చేయించామని చెప్పారు. తదుపరి విచారణ కూడా కొనసాగుతోందన్నారు.

ప్రజా సమస్యలపై 'సిపిఎం సమరభేరి'

◆ 30 నుంచి సెప్టంబర్ 4 వరకు నిరసనలు ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఎండుతున్న పంటలు, విద్యుత్ కోతలు, అధికధరలు, నిరుద్యోగ సమస్యలపై ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, వి.సావిత్రి, బి.శ్రీనివాసులుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం వల్ల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. దీనికి తోడు విద్యుత్ కోతలతో బోర్ల కింద వేసిన పంటలు కూడా ఎండి పోతున్నాయన్నారు. రైతులు తీవ్ర ఆందోళనలో ఉంటే జిల్లా పరిషత్ సమావేశానికి ఎమ్మెల్యేలు ఒకరు మినహా మిగిలిన వారెవరూ హాజరుకాకపోవడం దారుణమన్నారు. గడపగడప పేరుతో పర్యటిస్తున్న ఎమ్మెల్యేల దష్టికి వచ్చిన కరువు, కరెంటు సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన జిల్లా ప్రధాన సమావేశాలకే ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం సమస్యల పరిష్కారంపై వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. నాలుగు లక్షల ఎకరాల్లో విత్తనం వేయకపోవడం, వేసిన 5.32 లక్షల ఎకరాల్లో సగానికి పైగా పంటలు ఎండిపోతుండడం అత్యంత తీవ్రమైన విషయంగా ప్రభుత్వం పరగణించాలని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకునే సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఈ నెల 30 నుంచి శింగనమల, రాప్తాడు, గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లో జీపుయాత్రలు, అనంతపురం నగరంలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1వ తేదీ పంటల పరిస్థితులపై రైతుభరోసా కేంద్రాల వద్ద ధర్నాలు, 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సమరభేరి పోస్టర్లు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు. ఇలాంటి విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోదీకి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తుండడం మరింత విచారకరం అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలన్నారు. అధిక ధరలను అదుపు చేయాలన్నారు. కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపైనా సిపిఎం సమరభేరి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, మన్నీల రామాంజనేయులు, జగన్మోహన్, మల్లికార్జున, నిర్మల, వెంకటనారాయణ, ముష్కిన్, భాస్కర్, ఎస్.నాగరాజు, రమేష్, వలీ, ముత్తుజా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

తాగునీటి పథకం కార్మికుల సమ్మెకు మద్దతు

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికులకు బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. కీలకమైన తాగునీటి పథకాల నిర్వహణ పట్ల మొదటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లను మార్చడం, కార్మికులను తొలగించడంపై ఎమ్మెల్యేలకు ఉన్న శ్రద్ధలో కొంత భాగమైన నిధులు విడుదలపై ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. నెల నెలా వేతనాలు, పీఎఫ్, ఇఎస్ఐ లాంటి చట్టబద్ధమైన వాటి కోసం సమ్మె చేయాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. న్యాయమైన సమ్మెను పరిష్కరించకుండా అధికారుల ద్వారా విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే కార్మికులకు సంఘీభావంగా తాము ప్రత్యక్షంగా పాల్గొనాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కొనసాగుతున్న 'సత్యసాయి' కార్మికుల సమ్మె

ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

నార్పల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి నీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 4వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మండలంలోని బి.పప్పూరు పంపుహౌస్ వద్ద కార్మికులు దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టు నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. అదేవిదంగా కార్మికులకు 4 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోపాటు 9 నెలల నుంచి ఇపిఎఫ్, ఇఎస్ఐ మొత్తాన్ని జమచేయలేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చేసేది లేక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సత్యసాయి పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బకాయి పిఎఫ్ సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్ ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే మోటార్లు ఆన్ చేసే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్నా, తిరుపాల్‌నాయక్, శ్రీరాములు, హరి, ఓబన్న, వీరయ్య, వెంకటేష్‌నాయక్, చిన్నకేశవులు, శ్రీధర్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు..:మేయర్

అనంతపురం కార్పొరేషన్ : స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ పరిష్కారం చూపాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో తమ సమస్యలు తెలియజేస్తే పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో ప్రజలు సమస్యలను తెలియజేస్తున్నారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, నగరపాలక కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, డి ఈఈ చంద్రశేఖర్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై పోరాటాలు

ప్రజాశక్తి-శింగనమల

బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు స్ఫూర్తిగా రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలపై ఉద్యమించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఈనెల 30 నుంచి విద్యుత్ సమస్యలపై చేపట్టనున్న ఆందోళనలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలకు అంతులేకుండా పోతోందన్నారు. ముఖ్యంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ.. కార్పొరేట్లకు అనుకూలంగా పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ ఆదాయాన్ని రాబట్టాలని వివిధ రకాల పన్నుల వసూలుకు పూనుకోవడం బాధాకరమన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచమని చెప్పిన సిఎం జగన్.. ఇప్పటికి ఏడుసార్లు పెంచారని గుర్తు చేశారు. వివిధ రకాల సెస్‌ల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపుతో పేదల నడ్డి విరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రిస్వామి, నల్లప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, కొండారెడ్డి, సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద బషీరాబాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ట్రాన్స్‌కో కార్యాలయం ముందు పెంచిన విద్యుత్ బిల్లులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బషీరాబాగ్‌లో విద్యుత్ పోరాటం చేస్తే పోలీసులు కాల్పులు జరిపారన్నారు. ఈ పోరాటంలో అసువులు బాసిన అమరుల పోరాడి అమరులయ్యారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో రానున్న రోజుల్లో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉమాగౌడ్, నాగరాజు, శ్రీరాములు, బాల చౌడయ్య, భాస్కర్, రంగసామి, సూరి, కుమార్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పెంచిన విద్యుత్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బషీరాబాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు సోమవారం నివాళు లర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహం ముందు విద్యుత్ బిల్లులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించకకపోతే మరో బషీరాబాగ్ ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు సిద్ధప్ప, జ్ఞానమూర్తి, ఎర్రిస్వామి, సీనప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విద్యుత్ అమరవీరులకు సోమవారం పట్టణంలోని గాంధీ కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామమృష్ణ మాట్లాడుతూ బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన వారిని స్ఫూర్తిగా తీసుకుని రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, కెవిపిఎస్ మండల అధ్యక్షులు రంజిత్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి, పద్మావతి, సూర్యనారాయణ, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో 'బషీరాబాగ్' మృతులకు నివాళి

తాడిపత్రిలో బషీరాబాగ్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : విష గులికలు మింగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన నాగార్జున (27), జ్యోతితో 8ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొడవ పడుతూ ఉండేవారు. ఈతరుణంలో ఉల్లికల్లు గ్రామంలో జ్యోతి సోమవారం ఉదయం సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. విషయం తెలుసుకున్న నాగార్జున మనస్థాపం చెంది తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ సమీపంలోకి వచ్చి విష గుళికలు తిని ఆత్మహత్యకు చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి నాగార్జున మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసి బదిలీ అయిన వైద్యాధికారి జగదీష్, ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యంను స్థానిక సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయమ్మ, ఎంపిహెచ్ఎ ఎస్.సరస్వతమ్మ, కిరణ్‌కుమార్, శివకుమార్, పిహెచ్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జెవివి నూతన కమిటీ ఎన్నిక

గుత్తి : జన విజ్ఞాన వేదిక మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జన్నే కుళ్లాయిబాబు, దేశాయి నాగరాజు, డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీధర్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా రంగనాథ్, అహోబిలేసు, చక్రపాణి, కవి నరసింహులు, మండలాధ్యక్షులు ఎ.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులు నిజాముద్దీన్, కాశీరావు, పెద్దిరెడ్డి, రమేష్, హనుమన్న, సహాయ కార్యదర్శులు జి.రామదాసు, కేశవ, ఎంపీ.వెంకటరామిరెడ్డి, ఆర్.మస్తాన్, కోటేశ్వరరావు, దాదా ఖలందర్‌తోపాటు కార్యనిర్వాహక సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టిడిపితోనే మహిళల అభివృద్ధి

గుత్తి : టిడిపి ప్రభుత్వ హయాంలోనే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని టిడిపి యువ నాయకులు విష్ణుతేజ్‌గౌడ్, మండల కన్వీనర్ బర్దీవలి, తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.సరోజమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు మహిళల కోసం ప్రకటించిన పథకాల మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా కార్యదర్శి లక్ష్మీదేవి, లీలావతి, అంజలిదేవి, లక్ష్మీ, నాయకులు షేక్ ఫజులు, మహ్మద్ అలీ, రామకృష్ణ, సుధాకర్, రంగడు, సుధాకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

గార్లదిన్నె : జగతికి ఆదర్శప్రాయుడు, రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి విగ్రహాన్ని సోమవారం మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో ఘనంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలతో ప్రతిష్ట చేశారు. అనంతరం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎడిసిసి మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, టిడిపి నాయకులు ఇల్లూరు రామాంజనేయులు, మాజీ ఎంపిపి బ్రహ్మయ్య, బోయ రవి, మండలంలోని వాల్మీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షులు రాక

ఉరవకొండ : మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ భాస్కర్‌నాయుడు మంగళవారం ఉరవకొండకు వస్తున్నట్లు జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పలు విద్యాసంస్థల సందర్శనతోపాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

శింగనమల : జగనన్న విద్యాదీవెన పథకం కింద బటన్ నొక్కి లబ్ధిదారులు ఖాతాలకు నిధులు విడుదల చేసిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని రామాలయంలో వైసిపి నాయకులు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైసిపి ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి రవికుమార్ నాయక్, వైసిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.నారాయణ మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన పథకం పేదలకు వరం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జగనన్న విద్యా దీవెన పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ నరసాపురం సర్పంచి వెంకటరాముడు, నాయకులు మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన కార్పొరేటర్ చంద్రశేఖర్

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావును అనంతపురం నగర పాలక సంస్థ 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు సోమవారం విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో శంకరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు ఎస్టీల సమస్యలపై చర్చించారు. త్వరలోనే అనంతపురం జిల్లాలో పర్యటించేందుకు శంకరరావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ, అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగరాజునాయక్, వైసిపి నాయకులు సాకే శ్రీనివాసులు, కుంబా ఉదయ్‌కుమార్, కిరణ్, శేషు, రాము, శివ, అనిల్, ఆర్య, అక్బర్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

టిటిడి బోర్డు సభ్యుడికి సన్మానం

అనంతపురం : ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా నియమితులైన అశ్వర్థనాయక్‌ను సోమవారం నగరంలోని ఆర్‌కె నగర్‌లోని స్వగృహంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని ప్రత్యక్షంగా సేవ చేసే భాగ్యం తనకు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్టు నక్కల చంద్రశేఖర్, సుబ్బన్న, రాఘవేంద్ర, నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యను పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ భూసమస్యను వెంటనే పరిష్కరించాలని హాస్టల్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ హరిప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్‌కి సంబంధించిన 533 బి1.65 లో ఉన్న భూమిని స్వయానా ఆర్డీవోనే అపరస్కృత భూమిగా చూపారన్నారు. వెంటనే హాస్టల్ భూసమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిపిఓ మీనుగ రామాంజినమ్మ, హాస్టల్ కమిటీ సభ్యులు ఆనంద్‌రాజు, మీనుగ గోపాల్, మోపిడి వన్నూరుస్వామి, ముష్టూరు ఓబన్న, రాకెట్ల శ్రీరాములు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష, బాల్యవివాహాలపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక వైద్యశాల వైద్యులు రవిశంకర్ లింగ వివక్ష, బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాలికలకు 18ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇకపోతే పుట్టబోయేది ఆడ, మగ శిశువా అని తెలుసుకుని భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో స్త్రీ, పురుషులు సమానం అన్నారు. కావున లింగ వివక్ష చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, ఎంపిహెచ్ఇఒ మల్లికార్జున, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్ఎస్‌లు సరస్వతి, ఎఎన్ఎం అంజలి, శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : ఎంపిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల కేంద్రంలో అర్హులైన ఎస్సీలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న ఎస్సీలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు మూడెకరాల స్థలాన్ని జెసిబితో శుభ్రం చేయించారు. అనంతరం తహశీల్దార్ ఈరమ్మ, సర్వేయర్ శ్రీనివాసులుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 17ఏళ్లుగా ఇళ్ల పట్టాల పంపిణీ సమస్య ఉందన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి సమస్య వివరించడంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. త్వరలోనే ఇళ్లులేని ఎస్సీ కాలనీవాసులు దాదాపు 150 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, స్కూల్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, మండల యువ నాయకుడు దేశాయి సిద్ధార్ధ, కోఆప్షన్ మెంబర్ లతీఫ్, ఉప సర్పంచి ఓబులమ్మ, సచివాలయ కన్వీనర్ నాగరాజ్, వైసిపి నాయకులు ఎర్రిస్వామి, సత్తి, గృహసారథులు నాగరాజు, ఉలిగన్న, శివశంకర్, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు తెలిపారు. ఐదుగురు స్థానాలకు ఐదుగురు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. ఎన్నికైన సభ్యులు లీలావతి, రాజేశ్వరి, శేఖర్‌బాబు, అబుసాలేహా, రామాంజనేయులు ఉన్నారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 2వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ 404 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 339 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష పలితాల కోసం కళాశాల అకడమిక్ విభాగంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, వివిధ విభాగాల అధిపతులు చంద్రమోహన్‌రెడ్డి, బాలనరసయ్య, కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కళ్యాణి రాధ, అజిత, లలితకుమారి పాల్గొన్నారు.

రాయల్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గం : పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాలలో సోమవారం చెన్నైకి చెందిన 'ఆల్ సెక్' టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో రాయల్ డిగ్రీ కళాశాలకు చెందిన కుసుమ, అఖిల, కావ్య, రక్షిత, హర్షిత, రమ్యశ్రీ, టెంకసాల శ్రీనివాసులు, తరుణ్‌కుమార్, కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సాయినివాస్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను రాయల్ కళాశాల ప్రెసిడెంట్ బండి కృష్ణమూర్తి, కరస్పాండెంట్ బండి విక్రమ్, కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపక బృందం అభినందించారు.

పంట పొలాల పరిశీలన

ఆత్మకూరు : మండల కేంద్రంలో వర్షాధారితంగా సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, తదితర పంటలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ఎద్దడికి గురైన పంటలను కాపాడుకోవడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఇందుకు పొటాషియం నైట్రేట్ (13:00:45) ఏ 5గ్రా లేదా (19:19:19) మూడు 19 ఎరువు లేదా యూరియా ఏ 10 గ్రా చొప్పున ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బెట్ట పరిస్థితులు ఉన్నందున తట్టుకోవాడానికి ఎక్కువ వత్తుగా ఉన్న మొక్కలను వత్తు తీయాలని సూచించారు. వాటిని తొలగించడం ద్వారా నేలలో తేమను సంరక్షించుకోవడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, పద్మలత, కే.అశోక్‌కుమార్, అనంతపురం వ్యవసాయ పరిశోధన స్థానం ఆత్మ పీడీ మద్దిలేటి, అనంతపురం ఎడిఎ రవి, మండల వ్యవసాయ అధికారిణి జి.సుచరిత, ఎఇఒ సుజిత, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి మండల సమైక్య వార్షిక మహాసభ

నార్పల : మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో సోమవారం కుళ్లాయిస్వామి మండల సమైక్య 19వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా మాట్లాడుతూ 19ఏళ్లలో మహిళా సంఘాలు పురోభివృద్ధి సాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు బండి రేఖ, కార్యదర్శి సుధా, ఎపిఎం తిప్పమ్మ, సిడిపిఒ భారతి, గ్రామ సంఘాల మహిళలు, లీడర్లు, ఐకెపి సీసీలు కార్యాలయ సిబ్బంది, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పొలిమేర పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ఆత్మకూరు : మండల కేంద్రంలో వెలసిన పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన విగ్రహానికి జ్యోతులు పట్టి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు స్పష్టం చేశారు. సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి పథకం కార్మికుల సమ్మెకు మద్దతు కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన సోమవారం నగరంలోని జెవివి జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడంతోపాటు శాంతియుతంగా నిరసనలు తెలిపినా పట్టించుకోకపోవడంతోనే సమ్మె అనివార్యమైందన్నారు. మొదట కార్మికుల నిరసనకు దిగొచ్చిన కలెక్టర్ ఎం.గౌతమి రూ.23 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో అప్పట్లో నిరసన విరమించారన్నారు. హామీ ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా అమలు కాలేదన్నారు. తాగునీరు సరఫరా చేస్తున్న కార్మికుల సంక్షేమమే జిల్లా ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదన్నారు. నెలలు తరబడి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. శాశ్వత స్వభావం కలిగిన పనులకు ప్రభుత్వం శాశ్వత నిధులు కేటాయించాలని, కార్మికులను శాశ్వత ఉద్యోగాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విరివింపజేయాలని చెప్పడం దుర్మార్గంగా ఉందన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి ఎం.బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, యూనియన్ నాయకులు తిరుపాల్‌నాయక్, త్రిలోక్, రాము, నాగరాజు, ప్రభాకర్, వన్నూరుస్వామి, గంగాధర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్పొరేషన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మేయర్, డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు 2011లో 11 నెలల పీఎఫ్ బకాయి ఉందన్నారు. వెంటనే పిఎఫ్ అమౌంట్‌ను కార్మికుల ఖాతాలో జమచేయడంతో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం కన్సల్టెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని కోరారు. నైపుణ్యాన్ని బట్టి స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలను అమలు చేయాలని, హెల్త్ అండ్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, 60 ఏళ్ల పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, అనారోగ్యం, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ ద్వారా వచ్చే డెత్ బెనిఫిట్స్‌ను కుటుంబ సభ్యులకు ఇప్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ విభాగపు కమిటీ సభ్యులు, కార్మికులు, మిత్ర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'స్పందన'లో సిఐటియు నాయకుల వినతి

మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

భూఆక్రమణ నిరూపిస్తే సర్పంచి పదవికి రాజీనామా

ప్రజాశక్తి-గుత్తి

కొత్తపేట గ్రామ పరిధిలో స్థలం కబ్జా చేసినట్లు టిడిపి నాయకుడు జీవానందరెడ్డి నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని కొత్తపేట సర్పంచి ఆర్.గురుమస్తాన్ సవాల్ విసిరారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సహాయ, సహకారాలతో కొత్తపేట పంచాయతీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆరెకరాల ప్రభుత్వ భూమిని తానే కబ్జా చేశానని జీవానందరెడ్డి ఆరోపించడం బాధాకరమన్నారు. తన పేరిటగానీ, భార్యా, పిల్లల పేరగానీ సెంటు స్థలం ఉన్నట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్.రాముయాదవ్, ఉప సర్పంచి రాము ఆచారి, నాయకులు సుధాకర్‌యాదవ్, సురేష్‌యాదవ్, అబ్దుల్‌వహాబ్, వెంకటరాముడు, హాజీవలి, చిన్న మస్తాన్, వేణుకుమార్, నరేష్, బసప్ప, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కొత్తపేట సర్పంచి గురుమస్తాన్

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT -Tender Notice

1	Tender Notice No.	344/2023-24/TO to 380/2023-24/TO, General Funds, 15th FC Grant, CMDF & NCAP Funds
2	Scope of Work	CC Roads & Drains & Culverts, Engaging of vehicle on hire basis, Development of Greenary, Engagind of Tranctor for door to door Garbage Collection & Procurement of Vehicles
3	Estimate Cost Ranging	Rs. 0.99 to Rs. 28.00 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/-Commissioner
Municipal Corporation,
Anantapuramu

నేనూ సెల్ఫీ ఛాలెంజ్‌లు చేస్తా.. : విప్ కాపు

రాయదుర్గం : గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇక నుంచి తాను కూడా సెల్ఫీలు, వీడియోలు పెడతానని విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు పూర్తిగా మతిభ్రమించిందన్నారు. ఆయన ఐదేళ్ల ఎమ్మెల్యే పాలనలో నియోజకవర్గం గురించి పట్టించుకోని దద్దమ్మ కాలవ అన్నారు. అవకాశం ఉండి, చేయడానికి చేతకాక, ఇప్పుడు సెల్ఫీలు అంటూ తిరగడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు, మూడు రోజుల క్రితం తాను డి.హిరేహాల్ మండలం మల్లపనగుడి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనం, ఆరోగ్య కేంద్ర భవనాలను ప్రారంభించానన్నారు. అంతేగాకుండా సోమవారం కనేకల్ మండలం మాల్యంలో రూ.43 లక్షలతో నిర్మించిన మరో సచివాలయ భవనాన్ని ప్రారంభించామన్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట నియోజకవర్గంలో భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. అవి కనిపించని కాలవ శ్రీనివాసులు గతంలో తాను చేసిన ఏదో ఒక పనిని సెల్ఫీ తీసి డబ్బా కొట్టుకుంటున్నాడన్నారు. రాబోయే ఎన్నికల్లో రాయదుర్గం ప్రజలు ఈ కాలవను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

మేం నాణ్యమైన కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కోతలా.. : కాలవ

రాయదుర్గం : గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాయదుర్గంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తే వైసిపి అధికారంలోకి వచ్చాక విపరీతమైన కోతలు విధిస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలో వోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు టిడిపి హయాంలో రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కాలవ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమ లోవోల్టేజీ సమస్యతో తీవ్రమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటోందన్నారు. అప్పటి ఎన్నికల్లో తాను టిడిపి అభ్యర్థిగా ప్రజల్లోకి వెళ్లినప్పుడు గార్మెంట్స్ కార్మికులు ప్రధానంగా లోవోల్టేజీ సమస్యతోపాటు కోతల్లేని విద్యుత్ సరఫరా చేయాలని అడిగారన్నారు. తర్వాత తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిన్నరలోపే ఆయా సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. ప్రజల సమస్యలు, కష్టాలను పట్టించుకోకుండా బాధ్యతలేని వ్యక్తిగా విప్ కాపు రామచంద్రారెడ్డి వ్యవహరించడం దురదృష్టమన్నారు. నాలుగేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశాడన్నారు. సోషల్ మీడియాలో తనపై అసత్య ప్రచారాలు, తప్పుడు కథనాలు ప్రచురించడం మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.